గీటురాయి

ఇచ్ఛాపురపు రామచంద్రం

"రవీ! ఇంటర్వ్యూకి టైము కావడం లేదూ? అలా ఉన్నావేం? భయపడు తున్నావా?"

రవి ఏమీ అనలేదు మౌనంగా ఉండి పోయాడు

పాపారావతని దగ్గరగా వొచ్చి- ఆప్యాయంగా భుజం మీద చెయ్యి వేశాడు "మొదటిసారి అలాగే ఉంటుంది. అయినా నీకు భయ మేమిటి?అపరిమితమయిన తెలివి తేటలు కలవాడివి. నీకీ ఇంటర్వ్యూ ఓ లెక్కా?" అంటూ కొడుకుని - గోడవద్ద నున్న అద్దాల బీరువా ముందుకి నడిపించుకు వెళ్ళాడు

"చూడు ఈ బీరువా నిండా నీకు వొచ్చిన ప్రయిజులే ఎన్నెన్ని పుస్తకాలు! మెడల్స్.. సర్టిఫికేట్సు! టెన్త్ లో డిస్ట్రిక్ట్ ఫస్ట్ ఇంటర్ లో నూ డిగ్రీలో నూ కాలేజీ ఫస్ట్. నీ కొచ్చిన స్కాలర్‌షిప్పులు ఎవరి కొచ్చి ఉంటాయి? నువ్వు నాకు గర్వ కారణం. నీలాటి కొడుకు ఏ తండ్రి కయినా గర్వకారణమే పరిస్థితులు వక్రించబట్టి కాని - లేకపోతే నిన్ను పై చదువులకే పంపేవాణ్ని నన్ను క్షమించు నీ తెలివి తేటల కన్యాయం చేస్తున్నా నేమో

"లేదు నాన్నా.. లేదు. . నువ్వు అలా బాధ పడొద్దు. " కంగారుగా అన్నాడు రవి

"గుడ్డిలో మెల్లగా- యీ ఉద్యోగం సామాన్య మయినదని కాదు నీలాటి తెలివైన వాడికి కుశాగ్ర బుద్ధికి పైకి పోవడానికి చాలా చక్కని అవకాశా లున్నాయి దీనిలో - ప్రస్తుతానికి చిన్న ఉద్యోగంలా అనిపించినా. పైగా లంచం యివ్వక్కర లేదు. రికమెండేషను చేయించ నక్కర లేదు అంతా స్ట్రిక్ట్ ప్యూర్ మెరిట్. ఇటువంటి సువర్ణావకాశాలు అరుదుగా వొస్తాయి ఇది నీకు ఫస్ట్ ఇంటర్వ్యూ. ఏ పరీక్షలో నయినా ఫస్టున వొచ్చే నువ్వు. టెన్త్ లో . ఇంటర్ లో .. డిగ్రీలో ఫస్టుగా వొచ్చిన నువ్వు- యీ ఫస్ట్ ఇంటర్వ్యూలో నూ ఫస్టునే వొస్తావు. భయం లేదు "

అంతవరకూ తండ్రీ కొడుకుల మాటలు వింటూ నిలుచున్న సత్యవతమ్మ- చటుక్కున కలగ జేసుకుని . "ఔన్నాన్నా మీ నాన్నగారు చెప్పింది అక్షరాలా నిజం నీకీ ఉద్యోగం వొచ్చి తీరుతుంది నువ్వు అపర బృహస్పతివే నా బంగారు కొండవి." అంది గర్వంగా

పాపారావు నవ్వారు. "తల్లి దీవెన తప్పదంటారు. రవి! నీ కుద్యోగం రావడం ఖాయం. ధైర్యంగా వెళ్ళిరా."

అప్పుడే ఆ గదిలోకి అడుగు పెట్టిన వనజ- క్షణంలో నే పరిస్థితి నంతటినీ అర్థం చేసేసుకున్నట్టు.. "నీకు సందేహమూ భయమూ ఏమిటన్నయ్యా? ఇన్‌సల్ట్. ఎప్పుడయినా ఎక్కడయినా ఎందులో నయినా నువ్వే ఫస్ట్ మొనగాళ్ళకి మొనగాడివి నీకీ ఉద్యోగం వొచ్చి తీరుతుంది. తిరుగు లేదు నాకు పట్టు చీరా వొస్తుంది సందేహం లేదు అన్నట్టు.. నీకుద్యోగం రావడ మేమిటి, నాకు వొదిన కూడా వొచ్చేస్తుందోచ్." నవ్వుతూ ఒక్కసారాగి . "నాకు తెలుసు, మామయ్యా మహా తొందర పడుతున్నాడు నీకుద్యోగం వొస్తే రాధ నిచ్చి పెళ్ళి చేసెయ్యాలని గుడ్‌లక్ . అలా ఉద్యోగం యిలా రాధ చాన్సంటే నీదే అన్నయ్యా "

'ఔను బాబూ . ఇన్నాళ్ళూ మీ మామయ్యకంటికి ఆనేవాళ్ళం కాము మేము, అంతస్తులో తూగలేమని. కాని . ఎప్పుడయితే నువ్వు ప్రతి క్లాసులో నూ ఫస్టునవొస్తూ ప్రయిజులూ స్కాలర్‌షిప్‌లూ పేరూ సంపాదించడం మొదలు పెట్టావో- మీ అత్తయ్య మామయ్యలకి మనమూ మనుషుల్లా ఆనడం మొదలు పెట్టాము. రాధని నీకిద్దామని ఉందని తెలియ జేశారు ఐతే- పెళ్ళికి ఉద్యోగానికి ముడి పెట్టాడనుకో నీలాటి ప్రతిభాశాలికి ఉద్యోగం రావడ మెంతసేపు?" చిటికె వేశారు పాపారావు, నవ్వుతూ.

"విష్ యు గుడ్‌లక్ అన్నయ్యా!" అంటూ సాగనంపింది వనజ

రవికి పూర్తిగా అర్థమయిపోయింది యింట్లో అందరికీ తనమీదా తన తెలివి తేటలమీదా చాలా ఆశలూ నమ్మకాలూ బలంగా ఉన్నాయని ఎందుకో అతని కొక్కసారి భయం వేసింది అయినా సర్దుకుని- దేముడి మీద భారం వేసి అతను ఇంటర్వ్యూకి బయలు దేరాడు

* * * *

"ఓహ్!.... రవీ. . నువ్వు. . యీ యింటర్వ్యూకి. . నేను కల కనడం లేదుకదా?"

శంకర్ అలా పలకరించేసరికి రవి గత్యంతరం లేనట్టు నవ్వుతూ "పరిస్థితు లలాగ వొచ్చాయి " అని గొణిగాడు . తప్పు చేసినట్టు బాధపడుతూ శంకర్ పలకరింపు అతనికి వ్యంగ్యంగా తోచింది శంకర్ నవ్వుతూ- "ఈ యింటర్వ్యూకి నీకు కార్డు రావడం ఒక ఆశ్చర్యమయితే- యీ యింటర్వ్యూకి నువ్వు రావడం అంతకంటె పెద్ద ఆశ్చర్యం. ఊఁ . బాగా ప్రిపేరయ్యావా?" అడిగాడు

"నిజం చెప్పాలంటే అట్టే కష్టపడనే లేదు "

"నీలాటి బ్రిలియంట్ స్టూడెంట్‌కి ప్రిపరేషను దేనికిలే. హైస్కూలు నుంచి- కాలేజీ వదిలేవరకూ- నువ్వెప్పుడు కష్టపడ్డావని? పాఠం విన్నట్టే ఉండేవాడివి నేనల్లరి చేస్తూ. పుస్తకం పట్టుకున్నట్టే కనిపించేవాడివి కాదు, సినిమాలూ అవీ జోరుగా చూస్తూ. ఐతే ఏం, టెన్త్ లో... ఇంటర్ లో .. డిగ్రీలో- ఫస్ట్ రాంక్ నీదేకదా." రవి- త్రుళ్ళిపడ్డాడు శంకర్ తన నెత్తి పొడవడం లేదుకదా? అయినా- అసలే వికలంగా ఉన్న తన మనసుని మరింత చిత్రవధ చేయడానికి కాకపోతే- శంకర్ యిక్క డెందుకు దాపరించాలి? తనేమన్నా చెబుదామన్నా- శంకర్ తనకి హైస్కూలు నుంచి క్లాస్‌మేట్. తల్లి పుట్టిల్లు మేనమామ కెరుకే అన్నట్టు శంకర్ ముందు తను నోరెత్తడాని కేమీలేదు. అతనికి- తన గురించి అంతా తెలుసు

"నువ్వు బాగా తయారయ్యావా?" అడిగాడు రవి.

"నిజం చెప్పాలంటే గొడ్డులా కష్టపడ్డాను. ఇక్కడ ఉద్యోగం- లంచం ... రికమండేషను.... కులం - ప్రాతిపదికల మీద కాకుండా కేవలం క్యాండిడేట్ ప్రతిభ చూసే యిస్తారని తెలిసి.. యిక్కడ మెరిట్ తప్ప మరే అడ్డదారి ఉండదని విని ... నా శాయశక్తులా కష్టపడి చదివాను. మొదటి నుంచి నేను కష్టజీవినే కదా!"

ఆ చివరి మాట- రవిలో- గతాన్ని జ్ఞాపకం తెచ్చింది. ఈ శంకరూ మరో విశ్వనాధమూ- రోజుకి పది గంటలో పన్నెండు గంటలో చదివేవారు. తెగ శ్రమపడి చదివేవారు మామూలు పరీక్షల్లో శంకర్ ఫస్టు, విశ్వనాధం సెకండూ. పబ్లిక్ పరీక్షల్లో మాత్రం తనదే ఫస్టు రాంక్. శంకర్‌కి ఫస్ట్ క్లాసే వొచ్చేది. శంకరూ, విశ్వనాధంలు పడే కష్టాన్ని చూసి- తనూ తన మిత్రులూ వాళ్ళిద్దరినీ "కష్టజీవు"లనే వారు హేళనగా

"కష్టేఫలే " అన్నాడు రవి యధాలాపంగా

"ఇంతవరకూ ఎదురయిన అనుభవం మరోలా ఉంది. ఈ రోజుల్లో కష్టం కంటే అదృష్టమే ఎక్కువ ఫలమిస్తుందేమో "

ఎవరిదో ఇంటర్వ్యూ అయినట్టుంది. హాలులో ఒక్కసారి కలకలం రేగింది ఏం ప్రశ్నలు వేశారు? ఎలా ఉంది ఇంటర్వ్యూ? .. అంటూ అతన్ని చుట్టు ముట్టారు నలుగురైదుగురు.

అతను నవ్వేసి- "నేను క్యాండిడేట్‌ని కాను

క్లర్కుని. ఇంటర్వ్యూలు ఐదు నిముషాలలో ప్రారంభం కాబోతున్నాయి పన్నెండు మంది అభ్యర్థులు రెండు పోస్టులు మధ్యాహ్నం రెండు గంటలకి ఫలితాలు చెప్పేస్తారు. ఈ బోర్డుమీద – సెలక్టయిన వారిద్దరి పేర్లు ఉంటాయి. మొదట. . రవికుమార్ . రవికుమార్ ఎవరు?" అంటూ చూశాడు.

"నేనే.' అంటూ ముందు కొచ్చాడు రవి

"ఫస్ట్ నేమ్ మీదే. లోపలికి వెళ్ళండి గుడ్‌లక్."

శంకర్ కూడా గుడ్‌లక్ చెప్పాడు రవికి "ఎప్పుడూ ఫస్టు నీదే." నవ్వాడు.

రవి– లోపలికి వెళ్ళాడు అతను తిరిగి వొచ్చేటప్పటికి పది నిముషాలు పట్టింది

'ఎలా చేశావు?"

"బాగానే చేశాను.' అన్నాడు రవి బలవంతంగా నవ్వుతూ

"నిశ్చయంగా చాలా బాగా చేసి ఉంటావు అసలు నువ్వెలా చేసినా ఫస్టు నీదే ఔతుంది అందుకు సాక్ష్యం– గతమే అన్నట్లు – క్యాండిడేట్లు మొత్తం పన్నెండు మంది కదా ... మొదటి పేరు నీది, చివరి పేరు నాది.'

"దానికేముందిలే ' తేలిగ్గా అన్నాడు రవి అతని కక్కడి నుంచి, శంకర్ ముందు నుంచి ఎంత తొందరగా తప్పించుకుని వెళ్ళిపోదామా అని ఉంది గిల్టీ ఫీలింగ్ కలుగుతూంది కాని– ఏదో బలహీనత కూడా అతన్నావరిస్తూంది శంకర్ ముందు

"రిజల్ట్ వచ్చేవరకూ ఉంటావా?' ఉండమన్నట్లే అడిగాడు శంకర్.

"లేదు పనుంది రెండు గంటలకి కదా మళ్ళీ వొస్తాను ' అని హడావిడి పడుతున్నట్లు వెళ్ళిపోయాడు రవి వెడుతూ–

కష్టపడినా తగిన ఫలితం అందని వాడికి కడుపు మండడం సహజమే శంకర్ ధోరణి అలాగే ఉంది– అనుకున్నాడు మనసులో.

* * *

సాయంత్రం.. నాలుగున్నరఔతూంది

వరండాలో– పాపారావూ, సత్యవతీ, వనజా కూర్చున్నారు– ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్లు

ఇంక సహనం నశించినట్లు "రవి యింకా రాలేదేం?" అన్నారు పాపారావ్

"వొస్తాడు. ఆఫీసులో అపాయింట్‌మెంట్ కాగితం యివ్వాలి కదా అది తీసుకుని. . ఉద్యోగం వచ్చిన ఆనందంలో నలుగురు ఫ్రండ్సుకి చెప్పి .." ఏదో చెప్పబోయింది సత్యవతమ్మ

'అదేమి కాదు." అంటూ అడ్డుపడింది వనజ అన్నయ్య– అపాయింట్‌మెంట్ ఆర్డరు పట్టుకుని ఫ్రండ్స్ దగ్గరకి వెళ్ళడు '

"మరెక్కడికి వెడతాడు?'

"తిన్నగా రాధ దగ్గరకి వెళ్తాడు పెళ్ళాం బెల్లమయితే ప్రియురాలు పంచదార '

"నోరు ముయ్యి అన్ని ముదర కబుర్లే నీకు' కసిరింది సత్యవతి

అదే క్షణంలో గేటు ముందు– పోస్టుమాన్ ఆగాడు. వనజ పరుగెత్తి అతనిచ్చిన కవరందుకుని వొచ్చింది

"అరె! ఇది అన్నయ్య నుంచే ఓహో తను వొచ్చేసరికి ఆలస్యం ఔతుందని– అంతవరకూ చూసుకుని సంతోషిస్తూ ఉండమని అపాయింట్‌మెంట్ ఆర్డరు పంపించాడు కాబోలు లోకల్ పోస్టులో." అంటూ కవరుని తండ్రి కందించింది

పాపారావు ఆత్రతగా కవరు చింపారు, కళ్ళకి అద్దాలు తగిలించుకుని

కవరులో అపాయింట్‌మెంట్ ఆర్డరు లేదు

'ఏమిటండీ పైకి చదవండి." అంది సత్యవతమ్మ

కలువబాల

నవ వనితా పక్షపత్రిక

బాలరంజని

పిల్లల సచిత్ర మాసపత్రిక

ఇవి ఆంధ్రపత్రిక ప్రచురణలు

గీటురాయి

వణుకుతున్న కంఠంతో పైకి చదవసాగారు పాపారావు

అమ్మా నాన్నా వనజా!

నన్ను క్షమించండి

నాకు ఉద్యోగం రాలేదు ఆశ్చర్యపోకండి జరగవలసినదే జరిగింది ఇది న్యాయమే సహజమే

ఈ యింటర్వ్యూలో అపజయం ద్వారా నేనొక నిష్ఠురమయిన నిజం గ్రహించాను ఈ అనుభవం నా జీవితానికి పాఠం నేర్పింది

మనిషి తెలివి తేటలకు నేటి వ్రాత పరీక్షలూ- మార్కుల విధానమూ ఏ మాత్రమూ కొలబద్దలు కావు ఇది నేనింత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నానంటే- టెన్త్‌లో నేనేమి శ్రమపడి చదవలేదు. ఐనా నాకు కంప్యూటర్ కటాక్షం లభించింది కంప్యూటర్ చల్లని చూపుతో నేను జిల్లాకే ప్రథముడినైపోయాను

ఇంటర్‌లో ఆశ్చర్యకరంగా పేపర్లు తెలిసిపోయాయి ముందుగా. నాకూ మరొకడికి దానితో ఫస్ట్‌రాంక్ వచ్చేసింది కాలేజీలో ఇక డిగ్రీలో- స్లిప్పులు పుస్తకాలు లెక్చరర్ల సహాయం యివన్నీ కలిసి వచ్చి- ఫస్ట్‌రాంక్ తెచ్చేసుకున్నాను అంటే- నా మార్కులు నిజంగా నాకు రావలసిన మార్కులు కావు నా అదృష్టానికి వచ్చిన మార్కులవి నా మార్కులు నావి కావు!

ఇంటర్వ్యూలో -

నన్ను కరుణించడానికి కంప్యూటర్ లేదు

ప్రశ్నలు- ముందుగా లీకవలేదు

స్లిప్పులకి, సహాయాలకి విలువ లేదు వ్రాత పరీక్షలలో మొత్తం మూడుసార్లు నన్ను వరించిన అదృష్టానికి- యీ యింటర్వ్యూలో నాకెలా సహాయపడాలో అగమ్యగోచరమై పోయింది ఔను

ఇది- ఇంటర్వ్యూ పకడ్బందీగా అభ్యర్థి ప్రతిభని వెలికి తీయదలచుకున్న మౌఖిక పరీక్ష నిజమయిన తెలివి తేటలను నిగ్గు తేల్చే పరీక్ష ముగ్గురు మేధావులు నన్ను నా తెలివిని నిష్కర్షగా శోధించారు

తేలినదేమిటంటే- నేనూ- నేనూ, మీరంతా భ్రమపడుతున్నట్లు తెలివయిన వాడిని కానని ప్రతిభకే తప్ప అదృష్టాన్ని కాపాడగలిగేంత అవకాశం లేని యింటర్వ్యూలో బయటపడిన - చేదు నిజమేమిటంటే- నేను తెలివయిన వాడిని కానని కష్టపడి కృషి చేసేవారికే తప్ప అదృష్టంమీద ఆధారపడే వారికెల్లవేళలా విజయం చేకూరదని అందుకే నాకుద్యోగం రాలేదు

నేను- మీ అంచనాలని తలక్రిందులు చేశాను

మీ అందరి ఆశలనూ నాశనం చేశాను ఏం?

అందుకే సిగ్గుతో మీకు ముఖం చూపలేక మీ ముందు తలెత్తుకు తిరగలేక

పాపారావు యిక చదవలేక పోయారు

'రవి! నాన్నా!' బాధగా అరిచారు □